ఫిరాయింపు ఎమ్మెల్యేకే పీఏసీ చైర్మన్ పదవి

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించే వివిధ కార్యక్రమాలు, పథకాల అమలు సహా వివిధ అంశాలను పర్యవేక్షించేందుకు, వాటిపై సమీక్షలు చేసేందుకు శాసనసభలోని ఎమ్మెల్యేలతో కమిటీలను ఏర్పాటుచేస్తారు. ఇలా మొత్తం 18 శాసనసభ కమిటీలు ఏర్పాటవుతాయి. ఒక్కో కమిటీలో 13 మంది సభ్యులుంటారు. వీరిలో తొమ్మిది మందిని శాసనసభ నుంచి, నలుగురిని శాసనమండలి నుంచి ఎన్నుకుంటారు. ప్రతి కమిటీలో పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలి. శాసనసభలోని సభ్యుల సంఖ్య ఆధారంగా ఆయా పార్టీలకు కమిటీల్లో ప్రాతినిధ్యం దక్కుతుంది. వీటిలో 15 కమిటీలు సంక్షేమంతోపాటు వివిధ అంశాలకు సంబంధించిన అంశాలపై ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర సంక్షేమ శాఖలకు సంబంధించిన కమిటీ, ఎథిక్స్ కమిటీ, ప్రివిలేజెస్ కమిటీ, పిటిషన్స్ కమిటీ, ఎన్విరాన్‌మెంట్ కమిటీ.. ఇలా ఉంటాయి. మరో మూడు కమిటీలు అంటే పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ, ఎస్టిమేట్స్ కమిటీలు మాత్రం ప్రభుత్వ ఆర్థిక, పథకాల అమలు తదితర వాటికి సంబంధించిన అంశాలను చూస్తాయి. వీటిని ఫైనాన్స్ కమిటీలని కూడా అంటారు. ఈ కమిటీల్లో సభ్యుల ఎంపిక కోసం పార్టీలవారీగా నామినేషన్ వేస్తారు. వారి ప్రాతినిధ్యానికి అనుగుణంగా సభ్యులు ఎన్నికవుతుంటారు. పార్టీలు వారికి ఉండే సంఖ్యాబలాన్ని మించి నామినేషన్లు దాఖలు చేస్తే.. ఆ కమిటీకి ఎన్నికలు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (ప్రజాపద్దుల కమిటీ) రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రతి ఖర్చు, పనిని సమీక్షించి, లోటుపాట్లను ఎత్తిచూపి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తుంది.



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

ప్రతిపక్షానికే పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వాలి

శాసనసభలో అనాదిగా ఈ కమిటీ చైర్మన్ పోస్టును ప్రతిపక్షానికి ఇస్తున్నారు. 'రూల్ ఆఫ్ ప్రొసీజర్ అండ్ కండక్ట్ ఆఫ్ బిజినెస్ ఇన్ ద తెలంగాణ లెజిస్లేటివ్ అసెంబ్లీ' రూల్-250 ప్రకారం పీఏసీకి ఎన్నికలు నిర్వహిస్తారు. 'ప్రిన్సిపల్ ఆఫ్ ప్రపోర్షనల్ రిప్రజంటేషన్ బై మీన్స్ ఆఫ్ సింగల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓట్' అని స్పష్టంగా నియమావళిలో ఉన్నది. దీని ప్రకారం అసెంబ్లీ తొమ్మిది మంది సభ్యులను పీఏసీకి ఎన్నుకోవాలి. రాష్ట్ర శాసనసభ ఏర్పడేనాటికి, పీఏసీ కమిటీకి నోటిఫికేషన్ ఇచ్చే సమయానికి బీఆర్ఎస్‌కు ఉన్న బలం 38 మంది సభ్యులు. ఒక్కొక్క సభ్యుడిని ఎన్నుకోవడానికి 12.67 (13 మంది) మంది మద్దతు కావాల్సి ఉంటుంది. ఈ లెక్కన 119 మంది సభ్యులు ఉన్న శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలకు పీఏసీలో అవకాశం దక్కాలి. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు ఎవరుండాలన్నది బీఆర్ఎస్ పార్టీ నిర్ణయిస్తుంది. ఇందుకు అనుగుణంగా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత కేసీఆర్.. మాజీ మంత్రులు టీ హరీశ్‌రావు, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డితో పీఏసీకి నామినేషన్ వేయించారు. నామినేషన్ల గడువు ముగిసి చాలాకాలమైంది.

హఠాత్తుగా తెరపైకి గాంధీ

బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన అరికెపూడి గాంధీ జూలై 13న కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీలోనే లేని గాంధీ.. హఠాత్తుగా బీఆర్ఎస్‌కు దక్కాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని పొందడం గమనార్హం. అసలు ఆయన అభ్యర్థిత్వాన్ని ఎవరు బలపరిచారన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.

ఎన్నిక ఎందుకు నిర్వహించలేదు?

పీఏసీకి తొమ్మిది మందిని ఎన్నుకోవాల్సి ఉండగా, అంతకు మించిన నామినేషన్లు వస్తే స్పీకర్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డితోపాటు ఒకవేళ నిజంగానే అరికెపూడి గాంధీ నామినేషన్ వేసి ఉంటే.. తొమ్మిది స్థానాలకు పది నామినేషన్లు వచ్చి ఉంటే ఎన్నిక ఎప్పుడు నిర్వహించారన్న ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఉన్న స్థానాల కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే ఎన్నిక నిర్వహించాలి. ఎన్నిక నిర్వహించకుండానే హరీశ్‌రావు నామినేషన్‌ను తిరస్కరించారు. ఇది స్పీకర్ తనంతట తానుగా నిర్ణయం తీసుకునే విషయం కాదని రాజ్యాంగ నిపుణులు చెప్తున్నారు. ఎలిమినేషన్ ప్రాసెస్‌లో ప్రజాపద్దుల కమిటీ సభ్యులను ఎన్నుకోరని స్పష్టంచేస్తున్నారు. ఎలిమినేషన్ ప్రక్రియలేని కమిటీలో ఇలాంటి నిర్ణయం తీవ్ర చర్చకు దారి తీస్తున్నది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను పీఏసీ వంటి కీలకమైన కమిటీకి చైర్మన్‌గా స్పీకర్ ఎలా నియమించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు. గాంధీపై అనర్హత వేటు వేయాలని ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో స్పీకర్ పీఏసీ చైర్మన్‌గా గాంధీని నియమించడం వివాదాస్పదం అవుతున్నది. ఇదే విషయంపై 'నమస్తే తెలంగాణ' శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

అనాదిగా పీఏసీ చైర్మన్ పదవి ప్రతిపక్షానికే..

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు 1958-1959 నుంచి ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేకే పీఏసీ చైర్మన్ పదవి ఇస్తున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాగం జనార్ధన్‌రెడ్డిని పీఏసీ చైర్మన్‌గా టీడీపీ నిర్ణయించింది. సీఎం హోదాలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి మాత్రం నాగం ఎన్నికను వ్యతిరేకించారు. నాడు స్పీకర్ హోదాలో ఉన్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మాత్రం పీఏసీ చైర్మన్ పదవిని ప్రతిపక్ష నేత తమ పార్టీలో ఎవరికి ఇవ్వాలంటే వారికి ఇవ్వాల్సిందేనని చెప్పి నాగంను పీఏసీ చైర్మన్‌గా నియమించారు. జాతీయ స్థాయిలో చూసినా, ప్రధాని నరేంద్రమోదీ కూడా పార్లమెంటులో పీఏసీ చైర్మన్ పదవిని ప్రతిపక్ష నేత సిఫార్సు చేసినవారికే ఇచ్చారు. 2014-2016 మధ్యకాలంలో 543 మంది సభ్యులు ఉన్న సభలో కేవలం 44 మంది సభ్యులున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కేవీ థామస్‌ను పీఏసీ చైర్మన్‌గా నియమించారు. 2016-2019 వరకు కాంగ్రెస్ పార్టీకే చెందిన మల్లిఖార్జున ఖర్గే పీఏసీ చైర్మన్‌గా వ్యవహరించారు. 2019-2024 వరకు అదే పార్టీకి చెందిన అధిర్ రంజన్‌చౌదరి, తాజాగా 2024లో కేసీ వేణుగోపాల్ పీఏసీ చైర్మన్లుగా నియమితులయ్యారు. కానీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కారు మాత్రం ఫిరాయింపులకు ప్రోత్సహించి, కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ పోస్టు ఇవ్వడం చర్చనీయాంశమయ్యింది.

రాహుల్ గాంధీవి డొల్లమాటలే: హరీశ్‌రావు

దేశంలో రాజ్యాంగ హననం జరుగుతున్నదని, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేతిలో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొని డొల్లమాటలు చెప్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రతిపక్షానికి పీఏసీ చైర్మన్ పదవిని ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీనే తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని దుయ్యబట్టారు. చేతిలో రాజ్యాంగం పట్టుకొని నీతులు చెప్పే రాహుల్‌గాంధీ మాటలన్నీ నీటిమూటలేనని ఎద్దేవా చేశారు. రాజ్యాంగంపై రాహుల్‌గాంధీకి గౌరవం ఉంటే తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీఏసీ చైర్మన్ విషయంలో తగిన ఆదేశాలు జారీచేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో పీఏసీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీకి చెందిన కేసీ వేణుగోపాల్ తీసుకున్నారని, తెలంగాణలో మాత్రం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన అరికపూడి గాంధీకి ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్ చర్య రాజ్యాంగాన్ని నిట్టనిలువున పట్టపగలే ఖూనీ చేయడమేనని, రాజ్యాంగాన్ని పరిహాసం చేయడమేనని మండిపడ్డారు. రాహుల్‌గాంధీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కులేదని చెప్పారు.

> For the first time, a Member of the Opposition was appointed as Chairman of the Public Accounts Committee for 1958-59. This practice is continued since then.

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు 1958-1959 నుంచి ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యేకే పీఏసీ చైర్మన్ పదవి ఇస్తున్నారు.

పీఏసీ కమిటీ ఇదే

అరికెపూడి గాంధీ చైర్మన్‌గా వ్యవహరించే పీఏసీ కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చిక్కుడు వంశీ కృష్ణ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రామారావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీలు టీ జీవన్‌రెడ్డి, టీ భానుప్రసాద్‌రావు, ఎల్ రమణ, సత్యవతి రాథోడ్‌ను నియమించారు.

ఎస్టిమేట్స్ కమిటీ

ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్‌గా నల్లమద పద్మావతి నియమితులయ్యారు. సభ్యులుగా ఎమ్మెల్యేలు వాకిటి సునీత లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, సీహెచ్ విజయరమణారావు, కోరం కనకయ్య, రాందాస్ మలావత్, మామిడాల యశస్విని, పీ రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్, సుంకరి రాజు(శంబీపూర్‌రాజు), తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వీ యాదవరెడ్డి నియమితులయ్యారు.

పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ

పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్‌గా కే శంకరయ్యను నియమించారు. సభ్యులుగా ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పీ సంజీవ్‌రెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, కౌసర్ మోహియుద్దీన్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, తాతా మధుసూదన్, మీర్జా రియాజుల్ హసన్ నియమితులయ్యారు.

పార్లమెంట్‌లో ఓ నీతి.. అసెంబ్లీలో మరోనీతా?

- పార్టీ మారిన ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ పదవా?
- హైకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఇదేం దుర్మార్గం?
- రాజ్యాంగాన్ని కాలరాస్తున్న కాంగ్రెస్ సర్కార్
- ప్రజాస్వామ్యం అపహాస్యం: కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : 'పార్టీ మారిన ఎమ్మెల్యేలకు పీఏసీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) పదవా? పార్లమెంట్‌లో ఓ నీతి.. అసెంబ్లీలో మరో నీతా?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 'ఫిరాయింపు ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ పదవా? సిగ్గు...సిగ్గు..' అని ప్రభుత్వ తీరును ఎద్దేవా చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఇదేం దుర్మార్గం? అని సోమవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్ హోదాను, పార్టీ మారిన ఎమ్మెల్యేకు కట్టబెట్టడం ఎక్కడి సంస్కృతి ? అని నిలదీశారు. 'గీత దాటిన కాంగ్రెస్ ప్రభుత్వం, రాజ్యాంగాన్ని పూర్తిగా కాలరాస్తుననది. సంప్రదాయాలను మంటగలుపుతున్నది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది. పార్లమెంట్‌లో పీఏసీ చైర్మన్ పదవిని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఎంపీ కేసీ వేణుగోపాల్‌కు కట్టబెట్టిన విషయం మరిచారా? దేశ అత్యున్నత చట్టసభలో ఒక న్యాయం? రాష్ట్ర అత్యున్నత చట్టసభలో మాత్రం అన్యాయమా?' అని నిప్పులు చెరిగారు.

చిరుద్యోగుల వేతనాలు విడుదల చేయాలి

నాగర్ కర్నూలు జిల్లాలోని బిజినేపల్లి మండలం అల్లీపూర్ పంచాయతీ ఉద్యోగి 7 నెలలుగా జీతాలు రాక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించటం బాధాకరమని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీనే వేతనాలు అని ఊదరగొట్టిన కాంగ్రెస్ సర్కార్ దీనికి ఏం సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. గత నెలలో సూర్యాపేట ప్రభుత్వ వైద్యశాలలో డాటా ఎంట్రీ ఆపరేటర్ వసీం 3 నెలలుగా జీతాలేక ఆత్మహత్య చేసుకోవటం, ఆరు నెలలుగా వేతనాలు లేవని ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద గేట్ ఆపరేటర్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాళ్లపై పడటం వంటి వరుస సంఘటనలు కాంగ్రెస్ సర్కార్ వైఫల్యానికి పరాకాష్ట అని విమర్శించారు. ఇప్పటికైనా బకాయిపడిన వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

	K V Thomas	2014-16	2
	Mallikarjun Kharge	2016-2019	2
	Adhir Ranjan Chowdhury	2019-2024	5
	K.C. Venugopal	2024 - incumbent	

2014-2016 మధ్యకాలంలో 543 మంది సభ్యులు ఉన్న సభలో కేవలం 44 మంది సభ్యులున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కేవీ థామస్‌ను పీఏసీ చైర్మన్‌గా నియమించారు. 2016-2019 వరకు కాంగ్రెస్ పార్టీకే చెందిన మల్లికార్జున ఖర్గే పీఏసీ చైర్మన్‌గా వ్యవహరించారు. 2019-2024 వరకు అదే పార్టీకి చెందిన అధిర్ రంజన్‌చౌదరి, తాజాగా 2024లో కేసీ వేణుగోపాల్ పీఏసీ చైర్మన్లుగా నియమితులయ్యారు.

పీఏసీని పీసీసీ అనుకుంటున్నారా?

- పీఏసీ చైర్మన్ ప్రతిపక్షానికే దక్కాలి
- హరీశ్ అంటే రేవంత్‌కు వణుకు
- అరికెపూడికి పీఏసీ చైర్మన్ ఇవ్వడంపై కౌశిక్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) అనుకుంటున్నారా లేక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అనుకుంటున్నారా? ఉన్నతమైన కమిటీ ఏర్పాటులో చిల్లర రాజకీయం చేసి, రేవంత్ దివాలాకోరుతనాన్ని బయటపెట్టుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫైర్ అయ్యారు. పీఏసీ చైర్మన్‌గా అరికెపూడి గాంధీ నియామకం అప్రజాస్వామికం, అన్యాయమని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. నామినేషన్ వేయని వ్యక్తికి పీఏసీ ఎలా ఇస్తారని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. సభ్యుడిగా కూడా అర్హతలేని వ్యక్తికి చైర్మన్ ఎలా ఇస్తారని నిలదీశారు. ప్రతిపక్షానికి దక్కాల్సిన పీఏసీ పదవిని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి పీఏసీ సభ్యులుగా నామినేషన్లు వేస్తే ముగ్గురికి ఎందుకు అవకాశం లభించలేదని మండిపడ్డారు. బండారం బయటపెడతాడని రేవంత్‌రెడ్డి హరీశ్‌రావు పేరును తొలగించారని ఆరోపించారు. హరీశ్‌రావు అంటే రేవంత్‌కు వెన్నులో వణుకుపుడుతున్నదని అన్నారు. అరికెపూడి గాంధీని దొడ్డిదారిన పీఏసీలోకి అనుమతిని వ్వడం రాజ్యాంగ సూత్రాలకు జరిగిన అవమానమని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్‌కు ఏ మాత్రం విశ్వాసం ఉన్నా పీఏసీని కొత్తగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యాన్ని మంటగలిపారు

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య సూత్రాలను మంటగలిపింది. అరికెపూడి గాంధీకి పీఏసీ చైర్మన్ ఇవ్వడం అసెంబ్లీ నియమావళికి విరుద్ధం. పార్టీ మారి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేకు ఏ రాజ్యాంగ సూత్రం ప్రకారం పీఏసీ చైర్మన్ పదవి ఇస్తారు? హరీశ్‌రావుకు భయపడి చట్టసభల సాంప్రదాయాన్ని కాంగ్రెస్ తుంగలో తొక్కింది. రాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రగల్భాలు పలికే రాహుల్ గాంధీ దీనికి ఏం సమాధానం చెబుతారు.

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

ప్రతిపక్షానికి ఇవ్వకుండా కాంగ్రెస్ పీఏసీ తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. చేతిలో రాజ్యాంగం పట్టుకుని నీతి వాక్యాలు చెప్పే రాహుల్ గాంధీ మాటలు డొల్ల అని తేలిపోయింది. రాజ్యాంగం మీద గౌరవం ఉంటే తక్షణమే రాహుల్ గాంధీ రేవంత్‌రెడ్డిని ఆదేశించాలి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన అరికెపూడి గాంధీకి పీఏసీ ఇవ్వడం అంటే రాజ్యాంగాన్ని నిట్టనిలువునా పట్టపగలు ఖూనీ చేయడమే.

- బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

పార్టీ మారితే క్రిమినల్ కేసులు పెట్టాలి

వర్షా బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి.. కూనంనేని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఒక రాజకీయ పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరే ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని ఆటోమెటిక్‌గా రద్దు చేయాలని, పైగా ఓట్లు వేసిన ప్రజలను మోసం చేసినందుకు వారిపై క్రిమినల్ కేసు పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఫిరాయింపుదార్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, పల్లా వెంకట్, తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్ బాలమల్లేశ్, ఎం బాలనర్సింహాలతో కలిసి కూనంనేని మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేకు తన సొంత పార్టీ నచ్చకపోతే పదవికి రాజీనామా చేయాలని సూచించారు. ఇటీవల రాష్ట్రంలో వర్షాల వల్ల సర్వ కోల్పోయి దుఃఖంలో ఉన్న వారిని మానవత్వంతో ఆదుకోవాల్సింది పోయి విపత్తు నిధులకు సంబంధించి గతంలో ఖర్చు చేసిన యూసీలను ముందుగా అందించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో అపార నష్టం జరిగిందని, దీనిని కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించి కనీసం రూ.10వేల కోట్లు అందించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా తన ఒక నెల వేతనం రూ.2.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయాలని పార్టీ నిర్ణయించినట్టు ఆయన ప్రకటించారు. ఎన్‌కౌంటర్‌ల పేరుతో మావోయిస్టులను రాక్షసంగా కాల్చి చంపుతూ కేంద్ర ప్రభుత్వం ఆటవిక యుద్ధానికి తెరలేపిందని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ హింసను వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని, కేంద్రం ఆటవిక చర్యలను సమర్థించకూడదని కోరారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భార్య కన్నుమూత

జడ్చర్ల, సెప్టెంబర్ 9: బీఆర్ఎస్ నేత, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి(58) కన్నుమూశారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చెన్నైలో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివదేహాన్ని మంగళవారం ఉదయం స్వగ్రామమైన తిమ్మాజిపేట మండలం ఆవంచకు తీసుకురానున్నట్టు తెలిసింది.

ఇంజినీరింగ్ సీట్ల పెంపునకు అనుమతి

- మాస్ అప్ కౌన్సెలింగ్ జరపాలన్న హైకోర్టు
- ప్రవేశాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీఎస్ఈ సీట్లకు పెంపునకు ఏఐసీటీఈ ఆమోదించడంతోపాటు జేఎన్టీయూ ఎన్వోసీ ఇచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అనుమతి ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. సీట్ల పెంపునకు అనుమతించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఆ సీట్ల భర్తీకి మాస్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, తద్వారా జరిగే అడ్మిషన్లు తమ తుది తీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంటూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కోర్సుల ప్రారంభం, సీట్ల పెంపు, కుదింపు, కోర్సుల విలీనం, రద్దుకు నిరాకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 24న ఇచ్చిన మెమోను, సాంకేతిక విద్యా చట్టంలోని 20వ సెక్షన్‌ను సవాల్ చేస్తూ పలు విద్యాసంస్థలు హైకోర్టులో 11 వ్యాజ్యాలను దాఖలు చేశాయి. ఈ కేసుల్లో మధ్యంతర ఉత్తర్వుల జారీకి గతంలో సింగిల్ జడ్జి నిరాకరించడంతో ఆ విద్యాసంస్థలు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాయి. దీంతో సీట్ల పెంపునకు అనుమతించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన సీట్ల భర్తీకి మాప్ అప్‌కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఈ వ్యవహారాన్ని సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని చెప్పింది. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది.

ప్రమాద బీమా ధీమా ఏది?

- కేసీఆర్ హయాంలో హోంగార్డులు, ఆటో కార్మికులు, జర్నలిస్టులకు బీమా
- గడువు ముగిసినా రెన్యువల్ చేయని నేటి సర్కారు
- కార్మిక శాఖ ప్రతిపాదనలను పట్టించుకోని వైనం
- 12 లక్షల మందికిపైగా వర్తించని ఇన్సూరెన్స్

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సామాజిక భద్రతా పథకాన్ని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడమే లేదు. హోంగార్డులు, ఆటో డ్రైవర్లు, జర్నలిస్టులకు వర్తింపజేసే రూ.5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని ఈ ప్రభుత్వం గాలికి వదిలేసింది. పథకం గడువు ముగిసి నెల కావస్తున్నా ఇప్పటివరకు రెన్యువల్ చేయకుండా చోద్యం చూస్తున్నది. అధికారులు ప్రతిపాదనలు పంపినా ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టింది. వివిధ ప్రమాదాల బారిన పడి ఎన్నో కుటుంబాలు తమ ఇంటి పెద్దను పోగొట్టుకొని రోడ్డున పడుతున్న ఘటనలు అనేకం కండ్లెదుటే కనపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబసభ్యులను ఆర్థికంగానైనా ఆదుకునేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సామాజిక భద్రతా పథకాన్ని (సోషల్ సెక్యూరిటీ స్కీమ్) తీసుకొచ్చింది. 2015లో మేడే సందర్భంగా కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పిస్తూ ఆటో కార్మికులు, హోంగార్డులు, జర్నలిస్టుల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా పథకానికి అప్పటి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. దీని కింద రాష్ట్రంలో సుమారు 12 లక్షల మంది డ్రైవర్లు, 20 వేల మంది హోంగార్డులు, మరో 20 వేల మంది జర్నలిస్టులు లబ్ధిదారులుగా ఉన్నార